

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త


## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన కలెక్టర్



**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 7, ప్రభాతవార్త:** ఒకరోజు పర్యటనలో భాగంగా జిల్లాకు వి చ్చేసిన కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖా మం త్రి జి.కిష న్‌రెడ్డిని సోమవారం ఉదయం స్థానిక రోడ్డు, భవనాల అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. వీరితో పాటు శాసనమండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డి, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖాధికారి కనకదుర్గ భవాని తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

# పథకాలను ప్రజలకు చేరవేయడంలో పాత్రికేయుల పాత్ర కీలకం




**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 7, ప్రభాతవార్త:** ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమని, ప్రజాస్వామ్య నాలుగో స్తంభంగా అభివృద్ధి కార్యక్రమాల అనుసంధానకర్తలుగా పాత్రికేయులు భాగస్వాములు కావాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి వ్యవహారాల మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పత్రికా సమాచార కార్యాలయం వారు నెల్లూరులో నిర్వహించిన వార్తా లాప్ (పాత్రికేయుల వర్క్‌షాప్) కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఏ ప్రభుత్వమైనా ప్రజా సంక్షేమం కోసమే అభివృద్ధి పథకాలను ప్రవేశపెడుతుందని, ప్రజలకు మేలు చేసే ఉద్దేశమే అందులో ఉంటుందని, క్షేత్ర స్థాయిలో చిన్నపాటి సమస్యలు ఎదురైనా పాత్రికేయుల చొరవతో వాటిని సరిదిద్దవచ్చని అభిప్రా య పడ్డారు. పాత్రికేయులు, పోలీసులు, రాజకీయ నాయకులకు పండుగలు, సెలవులు ఉండవని, సమాజం కోసం ఎవరి స్థాయిలో వారు ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తూ ఉంటారన్న ఆయన ఈ క్రమంలో పాత్రికేయుల పాత్ర మరింత కీలకమైనదని తెలిపారు. వైద్యులు ఆరోగ్య సంరక్షణ ఉపాధ్యాయులు విద్యాబోధన ఇలా ఒక్కొక్కరు తమ తమ బాధ్యతలు నిర్వహిస్తున్న పాత్రికేయులు మాత్రం సమాజాన్ని జాగృతం చేయడంతో పాటు ప్రజలు ప్రభుత్వం మధ్య వారధిగా విలక్షణమైన బాధ్యతను నెత్తిన వేసుకుని పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల గురించి పాత్రికేయులకు తెలియజేసే సంకల్పంతో వార్తా లాప్ కార్యక్రమాన్ని నిర్వహించిన సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పత్రికా సమాచార కార్యాలయాన్ని అభినందించిన ఆయన ప్రభుత్వ పథకాలు ఏమున్నాయి... వాటి ద్వారా ప్రజలు ఎలా లబ్ది పొందాలి... ఏయే డాక్యుమెంట్లు అవసరం.. ఎవరు అర్హులు... లబ్ది పొందలేని వారికి ఇతర పథకాలు ఉన్నాయా లాంటి విషయాలను తెలియజేసేందుకు పాత్రికేయులు చొరవ తీసుకోవాలని సూచించారు. విమర్శించడం ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమన్న ఆయన తెలుసుకుని విమర్శించాలి. మంచి కార్యక్రమాలను అభినందించాలని సూచించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమ విజయంలో ప్రజలు, పాత్రికేయులు పోషించిన పాత్రను ఈ సందర్భంగా ప్రస్తావించిన కేంద్ర మంత్రి, అందరూ కలిసి సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ప్రచురిస్తున్న పక్ష పత్రిక న్యూ ఇండియా సమాచార్ గురించి కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. రాజకీయాలకు తావు లేకుండా కేంద్ర ప్రభుత్వ పథకాల వివరాలన్నింటినీ ఈ పత్రిక తెలియజేస్తుందని, ఇందులో సమాచారం తెలుసుకోవచ్చని, విమర్శించడానికి కూడా ఈ పుస్తకం పనికొస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విలేకరులు మరింత జాగృతమై ఉండాలని, అక్కడి ప్రజలకు ప్రభుత్వ పథకాల వివరాల గురించి తెలియజేసి వారి వెనుక అండగా నిలబడాలని ఇది పాత్రికేయులే గాక ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, స్వచ్ఛ భారత్, పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం, మిషన్ ఇంద్ర ధనుష్, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన్, సాయిల్ హెల్త్‌కార్డ్, ప్రధాన మంత్రి ఉజ్వల్ యోజన వంటి పథకాల గురించి ప్రస్తావించిన ఆయన, రాజకీయాలు, పార్టీలు, సిద్ధాంతాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందేందుకు ప్రతి ఒక్కరి చొరవ అవసరమని పేర్కొన్నారు. ఈ దిశగా అభివృద్ధిని ప్రోత్సహించే పాత్రికేయానికి పెద్ద పీట వేయాలని సూచించారు. శిక్షణా ఐఎఎస్ అధికారిణి విద్యాధరి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడానికి, ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి పత్రికలు ఒక వారధిగా పని చేస్తాయన్నారు. నేడు సమాజంలో మీడియా రంగంలో ముఖ్యంగా సోషల్ మీడియాలో అసత్య వార్తలతో కూడిన సమాచారం శరవేగంతో ప్రసారం అగుచున్నదని, వాటి పట్ల జాగ్రత్త పడాల్సి న అవసరం ఉందన్నారు. వార్తను వార్తగానే ప్రచురించాలి లేదా ప్రసారం చేయాలి గానీ, తన అభిప్రాయాన్ని తెలుపరాదన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పలు పథకాలు, సంక్షేమ కార్యక్రమాల వివరాలను పాత్రికేయులకు అవగాహన కల్పిస్తూ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డి, ఆర్‌డీవో మాలోల, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కనకదుర్గ భవాని, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎం. వెంకటేశ్వరప్రసాద్, పిఐబి అధికారులు అలెగరి, ఎం.వి.రాజు,శ్రీరామ్, జిల్లాకు చెందిన పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

## వేదగిరిపై వేడుకగా గరుడసేవ



**నెల్లూరురూరల్, నవంబరు7 ప్రభాతవార్త** నెల్లూరురూరల్ మండలం నరసింహకొండపై వేంచేసి ఉన్న ఆదిలక్ష్మీదేవి సమేత శ్రీవేదగిరి లక్ష్మీనర సింహస్వామి ఆలయంలో సోమ వారం పౌర్ణమిని పుస్కరించుకుని ఆలయ ప్రధానార్చకులు భాస్క రాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు విశేష పూజా కార్యక్రమాలను నిర్వ హించారు. రాత్రి స్వామివారికి గరుడసేవను నిర్వహించారు. మంగళ వాయిద్యాలు,వేద మంత్రోచ్ఛ రణలనడుమ సర్వాలంకారశోభితంగా స్వామి వారు శ్రీమహా విష్ణువుగా దర్శనమిచ్చారు.ఆలయ చైర్మెన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి ,ముఖ్యకార్య నిర్వ హణా ధికారి గిరిక్రిష్ణ తదితర ధర్మకర్తలు ఉత్సవ ఏర్పాట్లను సమీక్షించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా తగు చర్యలు తీసుకున్నామన్నారు. ధర్మకర్తలు అల్లూరు దినేష్‌కుమార్, నెట్టెంరఘురా మ య్య, పామూరు మల్లికార్జునరెడ్డి ,మడపాకుల జయమ్మ, సుంకర మస్తానమ్మ, విను కోటి ప్రసన్నలక్ష్మి, ఇండ్ల లక్ష్మమ్మ తదితర అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జయభారత్ హాస్పిటల్‌లోని అత్యవసర విభాగాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 7, ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలోని జయభారత్ హాస్పిటల్‌లో శ్రీ భగవాన్ మహావీర్ జైన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ. 15 లక్షలతో ఆధునీకరించి అత్యవసర విభాగాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖా మంత్రి జి.కిషన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. తొలుత కేంద్ర మంత్రి శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ ఆంజనేయస్వామి, భరతమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన గావించారు. నెల్లూరు నగరంలోని మూలాపేటకు చెందిన గీత వైభవం ట్రస్టు నిర్వాహకులు నజీర్ బాషా ఆధ్వర్యంలో బాలబాలికలు భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. ఈ సందర్భంగా వారు భగవద్గీతను పాఠ్యాంశంగా చేర్చాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జయభారత్ ఆసుపత్రి చైర్మన్ సీతా రామిరెడ్డి, శ్రీ భగవాన్ మహావీర్ జైన్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు మోహన్‌లాల్ జైన్, డిసిహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రసాద్ పథకంలో రూ.55కోట్లతో నరసింహకొండ అభివృద్ధి



**నెల్లూరురూరల్, నవంబరు5 ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకంలో రూ. 55కోట్లతో నరసింహకొండ అభివృద్ధికి కృషి చేస్తున్నామని కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు నిధులు మంజూరయ్యాయని ప్రకటించారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం నెల్లూరురూరల్ మండలం నరసింహకొండపై వేంచేసి ఉన్న ఆదిలక్ష్మీదేవి సమేత శ్రీవేదగిరి లక్ష్మీనరసిం హస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఆలయ చైర్మెన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డిలు కేంద్రమంత్రిని సత్కరించి స్వా గతం పలికారు. ఆలయ ప్రధానార్చకులు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు ఆలయ మార్యా దలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారిని ఆమ్మ వారిని దర్శించుకున్న అనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటాన్ని అందించారు. ఈసందర్భంగా విశేష పూజా కార్యక్రమాలను నిర్వ హించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రసాద్ పథకంలో నరసింహకొండను సరా ్వంగసుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. నరసింహకొండ ప్రాంతంలో పర్యా టక శోభ రానుందని తెలియజేశారు. అటు పర్యాటకంగానూ, ఇటు ఆధ్యాత్మికంగానూ వేదగిరిని తీర్చిదిద్ద తామని ప్రకటించారు. పథకంలో భాగంగా భక్తులకు సకల సౌకర్యాలు చేకూరగలవన్నారు. ఈకార్యక్రమంలో కమిషనర్ హరిత, సహాయ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎఎంసి చైర్మెన్ హరిబాబుయాదవ్, ఎంపిపి విజయకుమార్, సర్పంచ్ వేమిరెడ్డి అశోక్‌రెడ్డి తదితర వివిద శాఖల అధికారులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

## ఆదూరుపల్లిలో స్వల్ప భూకంపం

**చేజర్ల,నవంబర్7,ప్రభాతవార్త:** చేజర్ల మండలం ఆదూరుపల్లిలో సోమవారం ఉదయం స్వల్పంగా భూమి కంపించడంతో గ్రామస్తులు భయాందోళనచెందారు . ఒక్క సెకనుపాటు భూమి కదిలినట్లు అనిపించడం , ఇళ్ళలోని వస్తువులు కిందపడడంతో అర్థంకాక తీవ్ర అవస్థలు పడ్డారు. భూకంపం తగ్గిందని తెలిసిన వెంటనే ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయం దావానలంలా వ్యాపించడంతో రాష్ట్రం నలుమూలల నుంచి ఫోన్‌లతో బిజీ అయ్యారు.

## స్పందన అర్జీలకు సరైన పరిష్కారం చూపకుంటే కఠిన చర్యలు




**నెల్లూరుకార్పొరేషన్, నవంబరు 7, ప్రభాతవార్త:** స్పందనలో వచ్చే అర్జీలకు సరైన పరిష్కారం చూపకుండా మూసివేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ప్రజా విజ్ఞప్తుల దినం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి జిల్లా నలు మూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలను మొక్కుబడిగా కాకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కార మార్గం చూపాలన్నారు. ఆయా దరఖాస్తులు మరలా పునరావృతం కాకుండా నిర్దిష్ట గడువులోగా పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కరించిన దరఖాస్తులు తిరిగి రీఓపెన్ అవుతున్నాయంటే అర్జీదారులకు సరైన పరిష్కారం చూపలేదని అర్థమన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించిన పిదప క్షేత్ర స్థాయిలో దరఖాస్తుదారునితో తీసి ఫోటోలను స్పందన పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమకు సంబంధించిన అర్జీలను నిశితంగా పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, డీఆర్‌వో వెంకట నారాయణమ్మ, డీఆర్‌పి, మెప్మా, హౌసింగ్, పీడీలు సాంబ శివంరెడ్డి, రవీంద్ర, నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పెంచలయ్య, సర్వశిక్ష ఎపిసి ఉషారాణి, డిఎస్‌వో వెంకటేశ్వర్లు, డిపివో ధనలక్ష్మీ, విద్యుత్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు వెంకటసుబ్బయ్య, కృష్ణమోహన్, రంగ వరప్రసాద్, సర్వే లాండ్ రికార్డ్స్ ఎడి హనుమాన్ ప్రసాద్, తెలుగు గంగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధాకర్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వైకాపా వారు వ్యాపారాలు చేయకూడదా?



**నెల్లూరురూరల్, నవంబరు7 ప్రభాతవార్త** వైకాపా వారు వ్యాపారాలు చేయకూడదా అని రాజ్యసభసభ్యులు, వైయస్సార్సీపి జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డిప్రభాకరరెడ్డి ప్రశ్నించారు.సోమవారం నెల్లూరు నగరంలోని వైయస్సార్సీపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వ్యాపారాలు కేవలం తెలుగుదేశంవారు మాత్రమే చేయాలా అంటూ నిలదీశారు. వ్యాపార, రాజకీయ లావాదేవీల విషయ మై కుటుంబసభ్యుల్లో మరీముఖ్యంగా మహిళలను తెరమీదకు తీసుకురావడం తగదని హితవు పలికారు. రేడియంట్ డవలపర్స్ భూమి కేవలం విపిఆర్ ప్రాజక్ట్సుకు సంబంధించిన వ్యాపార విషయంగా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. ఈఅంశంలో ఎటువంటి కుంభకోణం లేదన్నారు. ఆసంస్థతో తనకు 30ఏళ్ల అవినాభావ సంబంధం ఉందన్నారు. ఎన్నో సంస్థలతో వ్యాపార లావాదేవీలు తమ సంస్థకు ఉంటాయన్నారు. హైరైజ్ బిల్డింగులకు సంబంధించి 70-30 అగ్రిమెంట్లు మార్కెట్లో ఎన్నో ఉన్నాయన్నారు. అగ్రిమెంట్లో భారతి అన్న పేరు కనిపిస్తూనే ముఖ్యమంత్రి భార్య అనుకోవడం పొరపాటన్నారు. ముఖ్యమంత్రి అత్త పేరు భారతి అని స్పష్టం చేశారు. విశాఖలో ప్రాజెక్టును దెబ్బతీశే దురుద్దేశ్యంతో వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని వివరించారు.

# గణేష్‌ఘాట్‌లో వేడుకగా కార్తీక దీపోత్సవం





**నెల్లూరురూరల్, నవంబరు7 ప్రభాతవార్త** రూరల్ పరిధిలోని నెల్లూరు చెరువు స్వర్ణాల ఘాట్‌లో సోమవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించిన కార్తీక మహా దీపోత్స వ కార్యక్రమం వేడుకగా సాగింది. ఈకార్యక్రమంలో పాల్గొనేందుకు ఉదయం నుండే భక్తులు పోటెత్తారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా గణేష్ ఘాట్‌లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైకాపా రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలు ఉత్సవాల ఏర్పాట్లను దగ్గరుండి మరీ సమీక్షించారు. మహాదీపోత్సవంలో ప్రతిష్టించిన శివలింగానికి స్వయంగా అభిషేకించుకునేందుకు భక్తులు ఉత్సుకతను ప్రదర్శించారు. స్థానికంగా ప్రతిష్టించిన పంచముఖ ఈశ్వరుడు, కళ్యాణ వెంకటేశ్వరస్వామిలను భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన శివపార్వతుల కళ్యాణం కమనీయంగా సాగింది. వివిద నదీజలాలను డ్రోన్‌ల ద్వారా భక్తులకు సంప్రోక్షణ చేశే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాయంత్రం వేళ అసంఖ్యాకంగా మహిళా భక్తులు తరలివచ్చి కార్తీక మహా దీపోత్సవాన్ని జయప్రదం చేశారు. హరిద్వార్ అర్చకులచే నిర్వహించిన గంగాహారతి కార్యక్రమానికి భక్తుల నుండి విశేష స్పందన లభించింది. ఈసందర్భంగా పరిపూర్ణానందస్వామి చేసిన అభిభాషణ, ప్రముఖ వ్యాఖ్యాత గరికపాటి నరసింహారావు ప్రవచనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. భక్తులకు విరివిగా తీర్థప్రసాదాలను అందజేశారు. కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, భారత రక్షణ సాంకేతిక సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి, స్వర్ణభారత్‌ట్రస్ట్ చైర్మెన్ దీపావెంకట్ తదితర ప్రముఖులు దీపోత్సవంలో పాల్గొని, పూజలు నిర్వహించారు. కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో స్థానిక కార్పోరేటర్ విజయలక్ష్మి, వైకాపా నాయకులు మిద్దె మురళీకృష్ణ తదితర దీపోత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.





## సర్వేపల్లిని అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యం



**మనుబోలు, నవంబరు 7 ప్రభాతవార్త** సర్వేపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. గడపగడపకు కార్యక్రమంలో భాగంగా రెండో రోజు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధికారులు, పార్టీ నాయ కులు, కార్యకర్తలు, వాలంటీర్లతో కలిసి కోదండరామపురంలో పర్యటించారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విజయవాడ నుంచి నేరుగా సోమవారం కండలేరు గట్టున వున్న సంగమేశ్వర దేవాలయానికి చేరుకున్నారు. అక్కడ స్వామి వారిని దర్శించుకొని గిరిజన కాలనీలో గడపగడపకు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడ నుండి నేరుగా కోదండరామపురం వచ్చి ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కరపత్రాన్ని అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రజలు కోరుకున్న అభివృద్ధే అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా సంక్షేమ పథకాలు, సంక్షేమ ఫలాలు అందుతున్నాయా లేదా తెలుసుకోవడం మొక్కుబడిగా కాకుండా చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ పరిధిలో తిరిగిన ప్రజాప్రతినిధికి గుర్తించిన పనులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 20 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నారని కాకాణి తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని వివరించారు. పలుచోట్ల కాకాణి గోవర్ధన్‌రెడ్డికి శాలువాలు కప్పి సన్మానించడం, పూలమాలలు వేయడం, బొకెలు అందించడం, హారతులు పట్టడం, పూలు చల్లుతూ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా కన్వీనర్ బొమ్మిరెడ్డి హరిగోపాల్‌రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు చిట్టమూరు అజయ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ చిట్టమూరు అనితమ్మ, సర్పంచ్ కంచి పద్మమ్మ, ఉపసర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ డైరెక్టర్ దాసరి భాస్కర్‌గౌడ్, వైసిపి నాయకులు ముంగర విజయభాస్కర్‌రెడ్డి, ముంగర రవీంద్రరెడ్డి, కుడుముల వెంకట రమణయ్య గౌడ్, కోసూరు కోటేశ్వర గౌడ్, తహశీల్దార్ సుధీర్, ఎంపిడివో గండవరం వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఎఇ రవికుమార్, ట్రాన్స్‌కో ఎఇ రవికుమార్, ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఎపియం రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సంగమేశ్వరుని సన్నిధిలో పోటెత్తిన భక్తులు



**సంగం నవంబర్ 7 ప్రభాతవార్త** కార్మికపౌర్ణమి పురస్కరించుకొని సంగమేశ్వంస్వామి ఆలయంలో మహిళలు పోటెత్తారు. ఆలయంలో పెద్ద సంఖ్యలో కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయ ప్రాంగణంలో భారీశివలింగాకృతిని ఏర్పాటు చేసి దీపాలు పెట్టారు. సంగమేశ్వరస్వామి ఆలయంలో జెడ్పిసిఇఒ చిరంజీవి దంపతులు సంగమేశ్వరు డ్ని,కామాక్షితాయిని దర్శించుకున్నా రు.సంగ మేశ్వరస్వామి సన్నిధి కార్తిదీప శోభతో అత్యంత సుందరంగా అలరాడింది.

## సీనియర్ సిటిజన్స్ సదస్సుకు హాజరైన పోతుల



**ఉలవపాడు, నవంబరు 7, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో శేషారెడ్డి హాస్పిటల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ సదస్సుకు కందుకూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా హాస్పిటల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును, అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు పొదిలి శ్రీనివాసరావు, ఆత్మకూరు పంచాయతీ సర్పంచ్ నాళం గోవిందమ్మ, పెనుకొండయ్య తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## వేగూరులో ఎమ్మెల్యే గడపగడపకు నేడు

కోవూరు, నవంబరు7 ప్రభాతవార్త : కోవూరు మండలం వేగూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వేగూరు కండ్రిగ, సీతారామపురం, పల్లిపాలెం ప్రాంతాల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొంటారని మండల కన్వీనర్ ఎన్. సుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

## అంకమ్మతల్లి దేవాలయానికి విరాళాలు



**కందుకూరు నవంబరు 7, ప్రభాతవార్త:** కందుకూరు పట్టణంలో శాసనసభ్యులు మహీధర్‌రెడ్డి నేతృత్వంలో చేపడుతున్న శ్రీ అంకమ్మతల్లి దేవాలయ పునర్నిర్మాణానికి దాతల విరాళాల పరంపర కొనసాగుతుంది. ఇప్పటికే అనేకమంది దాతలు లక్షలాది రూపాయలు నిర్వహాక కమిటీకి అందచేశారు. కుండా అంజిరెడ్డి కుమారుడు రఘునాథ రెడ్డి రూ.5116లు, యం. వెంకటరావు ధర్మపత్ని సుభాషిణి, రూ.1116లను కమిటి సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో మాదాల మాల్యాద్రి, కోవూరి మాలకొండయ్య, ఆవుల మాధవరావు తదితరులు ఉన్నారు.

## శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు



**వలేటివారిపాలెం నవంబరు 7, ప్రభాతవార్త:** కార్తీక మాసం మరియు కార్తీకపూర్ణమి సందర్భంగా మం డలంలోని శివాల యాలు సోమవారం భక్తుల శివ నామస్మరణతో మార్మో గాయి. ఆలయ ప్రాంగణాన్ని మహిళాభక్తులు దీపాలతో దేదీప్యమానంగా అ లం కరించారు. దీంతో ఆలయ ప్రాంగణ మంతా శోభా యి మానంగా విరాజిల్లింది. కార్తీకమాసంలో శివు నికి ప్రత్యేకపూజలు నిర్వ హిస్తే తమ మనోవా ంఛ లు నెరవేరతాయని భక్తుల నమ్మకం. దీంతో అనేక మంది భక్తులు ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. వలేటివారిపాలెం, కలవల్ల, శాఖవరం, పోకూరు, రోళ్లపాడు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో స్వామివారికి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేక ం చేశారు. వలేటివారిపాలెం సమీపంలోని భ్రమరాంబ సమేతంగా వేంచేసి ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ అధికారి వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వలేటివారిపాలెంకు చెందిన శివభక్తబృందం ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పరిసర గ్రామాలైన వలేటివారిపాలెం, కాకర్లపాలెం, చుండి, అయ్యవారిపల్లె, పోలినేనిచెరువు, అంకభూపాలపురం, లింగపాలెం, రోళ్లపాడు, పోలినేనిపాలెం, ఉప్పలపాడు, అమ్మపాలెం, బంగరక్కపాలెం, తదితర గ్రామాలనుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరైనారు. భక్తులచే ఆలయ పూజారి చంద్రకాంత్ పూజలుఅభిషేకం చేయించారు. ఇందులో బాగంగా మండల మేజిస్ట్రేట్ మరియు తహసిల్దార్ కె.బి.వి.టి.సుందరమ్మ ఆర్ఐ నరసయ్యలు స్వామివారిని ఆలయసిబ్బంది యోగానంద్ తదితరులు సందర్శించారు. వీరిచే పూజారి ప్రత్యేక పూజలు చేయించారు. సుమారు 3వేల మందిదాకా ఉచిత అన్నదానం ఏర్పాటుచేశారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో జరుగు ప్రత్యేక కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఇందుకోసం శివభక్తబృందం ముందుగానే గ్రామాల్లో ఆటో ద్వారా ప్రచారం నిర్వహించారు. దీంతో భక్తులు పెద్దఎత్తున హాజరైనారు. ఘనంగా అన్నదానం:శివాలయంలో భక్తులు ఈ కార్యక్రమాన్ని గత ఐదారేళ్లుగా నిర్వహిస్తున్నారు. పలువురు భక్తులు కార్యనిర్వహకబృందంగా ఏర్పడి ఈ కార్తీక మాసోత్స వాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో బాగంగానే శివభక్తబృందం ఈ కార్యక్రమాన్నిజయప్రదం చేయాలని ఆటో వాహనంద్వారా ఊరారా ప్రచారం నిర్వహించారు. ప్రత్యేకపూజలతోపాటు ఉచిత అన్నదానం కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. దీంతో సుమారు 3వేలకి పైగా భక్తులు హాజరై ప్రత్యేకపూజలు చేసినట్లు నిర్వహకులు తెలిపారు.

## నరసింహకొండ అభివృద్ధికి కృషి: కలెక్టర్



**నెల్లూరురూరల్, నవంబరు7 ప్రభాతవార్త** నెల్లూరురూరల్ మండలం నరసింహకొండ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధరబాబు తెలిపారు. జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నరసింహకొండపై మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో నూరుశాతం అక్షరాస్యత సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అందుకోసం అక్షర చైతన్యం కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నామన్నారు. గతంలో జయప్రదం అయిన స్ఫూర్తితో అక్షర చైతన్యం-2 కార్యక్రమాన్ని ప్రస్తుతం చేపట్టామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వాలంటీర్లు, సిబ్బంది నిరక్షరాస్యులను గుర్తించాలన్నారు. వారికి అక్షర జ్ఞానం కల్పించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో 55వేల నిర క్షరాస్యులను గుర్తించామన్నారు. వారికి రెండు పుస్తకాలు అందిస్తున్నామన్నారు. అక్షర కేంద్రాల్లో సాయంత్రం వేళ అక్షరబోధ చేయిస్తామని వివరించారు. ఎపిఓపెన్ స్కూల్ ద్వారా పరీక్షలు రాయించి సర్టిఫికేట్లు అందిస్తామన్నారు. జనవరి 26లోగా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చి నూరుశాతం అక్షరాస్యత సాధించేందుకు ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు.

**ఆలయంలో ప్రత్యేకపూజలు:** నరసింహకొండపై వేంచేసి ఉన్న ఆదిలక్ష్మీదేవి సమేత శ్రీవేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సోమవారం కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మెన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ముఖ్యకార్యనిర్వహణాధికారి గిరిక్రిష్ణ తదితర ధర్మకర్తల ఆధ్వర్యంలో కలెక్టర్‌ను ఆలయ మర్యాదలతో సా ్వగతించారు. ఆలయ ప్రధానార్చకులు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించి ఆశీర్వచనం చేశారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇన్స్‌పెక్టర్ ఆర్‌కె చైతన్య, ధర్మకర్తలు అల్లూరు దినేష్‌కుమార్, నెట్టెం రఘురామయ్య, పామూరు మల్లికార్జునరెడ్డి, మడపాకుల జయమ్మ, సుంకర మస్తానమ్మ, వినుకోటి ప్రసన్నలక్ష్మి, ఇండ్ల లక్ష్మమ్మ తదితర అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ అదాలత్

**చేజర్ల, నవంబర్7,ప్రభాతవార్త:** మండలంలోని బోడిపాడు సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ప్రత్యే ్యక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఎఇ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం ఉదయం 11-30నుండి మధ్యాహ్నం 1-30వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. ఎస్‌పిడిసిఎల్ ఇన్‌చార్జ్ కె.రామ్మోహన్‌రావ్, టెక్నికల్ మెంబర్ ఎస్.ఎల్.అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు ఈశ్వరమ్మలు ఈ విద్యుత్ అదాలత్‌లో పాల్గొంటారన్నారు. పొదలకూరు సబ్‌డివిజన్ పరిధిలోని చేజర్ల, కలువాయి, పొదలకూరు మండలాల నుంచి వినియోగదారులు హాజరై సమస్యలను తెలియజేస్తే వాటికి పరిష్కార మార్గం చూపుతారని ఎఇ తెలిపారు. ఆపరేషన్ ఎస్ఇ వెంకటసుబ్బయ్య ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు .సబ్‌డివిజన్ పరిధిలోని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## భక్తులతో క్రిక్కిరిసిన శివాలయాలు



**చేజర్ల, నవంబర్7, ప్రభాతవార్త:** మండలంలోని పలు శివాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. కోటితీర్ధంలోని కోటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలు నిర్వహించారు. ఆలయానికి ఉత్తరంవైపున పెన్నానది ఉండడంతో భక్తులు నదీస్నానమాచరించి సాయంత్రం 4-30గంటలకు పౌర్ణమిఘడియలు రావడంతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లాలోని నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయపాలకమండలి సభ్యులు భక్తులకోసం అన్ని ఏర్పాట్లు గావించారు. పూజారి సుదర్శనశర్మ అభిషేకాలు , అర్చనలు నిర్వహించారు. తూర్పుకంభంపాడులోని నాగేశ్వరాలయం, చేజర్ల శివాలయం, ఆదూరుపల్లి సమీపంలోని రామలింగేశ్వరాలయాల్లోను భక్తులు పెద్ద ఎత్తున హాజరై కార్తీకదీపాలు వెలిగించారు . మంగళవారం చంద్రగ్రహణం కావడం వలన ఎక్కువమంది సోమవారమే కార్తీకదీపాలు వెలిగించారు.

## మహిమలూరు మెగా కంటివైద్యశిబిరంలో 662మందికి పరిక్షలు



**ఆత్మకూరు, నవంబర్7, ప్రభాతవార్త:** మండ లంలోని మహిమలూరులో నిర్వహి స్తున్న శంకర్‌నేత్రాలయ మెగా కంటివైద్య శిబిరంలో సోమవారం రెండవరోజుకు 662మంది రోగు లను వైద్యులు పరిక్షించారు. వీరిలో 62 మందికి స్థానికంగా ఏర్పాటు చేసిన మొబైల్ వాహనంలో ఆపరేషన్లకు అర్హులుగా గుర్తిం చా రు. 15మందిని చెన్నైలోని శంకర్ నేత్రాలయ వైద్యశాలలో ఆపరేషన్‌లు చేసేలా వైద్యులు నిర్ధారించారు. మహిమలూరు మెగా వాహనంలో బుధవారం నుంచి ఆపరేషన్లు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. శంకర్‌నేత్రాలయంలో నిర్వహించే ఆపరేషన్లు సు మారు 90వేల రూపాయలు ఖర్చు అవుతుందని వీటిని శంకర్‌నేత్రాలయ వైద్యశాల వారు ఉచితంగా చేస్తారని మెగా క్యాంప్ నిర్వాహకులు తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో మెగాక్యాంప్ అయినప్పటికీ ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని ఉదయగిరి, వైఎస్ఆర్ కడపజిల్లా మైదుకూరు వంటి సుదూర ప్రాంతాల నుంచి కూడా రోగులు ఈ వైద్యశిబిరానికి హాజరయ్యారు. కేంద్ర రక్షణశాఖ సాంకేతిక సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి సారధ్యంలో నిర్వహిస్తున్న ఈ మెగా శిబిరానికి రోగుల తాకిడి ఎక్కువగా కన్పిస్తోంది. సతీష్‌రెడ్డి సేవలను ఈసందర్భంగా పలువురు ప్రశంసిస్తున్నారు.

## కలిగిరి మండలం నీటి సమస్య తీర్చండి



**కలిగిరి, నవంబర్ 7, ప్రభాతవార్త;** ఉదయగిరి నియోజక వర్గంలోని కలిగిరి మండలంలో సాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నందున సాగునీటి సమస్య తీర్చాలంటూ ఉదయగిరి నియోజకవర్గ బిజెపి నేతలు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా దీనితో కలిగిరి మండల నాయకులు కిషన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా కిషన్‌రెడ్డి నియోజకవర్గంలోని సమస్యల్ని ప్రస్తావించగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నందనవనం ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో కలిగిరి మండలంలోని సమస్యల్ని కేంద్రమంత్రి వద్ద ఏకరవు పెట్టారు. మండలంలో సోమశిల ఉత్తం కాల్వ పోతున్నా మండలంలోని అనేక చెరువులకు నీరురాక ఎండిపోతున్నాయన్నారు. అన్ని వసతులు ఉన్నా పాలకులుపట్టించుకోక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రమైన కలిగిరి చెరువు ఆనుకొని ఉత్తరకాల్వ పోతున్నా చెరువుకు నీరు రావడంలేదన్నారు. చెరువుకు ఎత్తిపోతల పథకంద్వారా కలిగిరిలోని రెండుచెరువులకు నీరు నింపాల్సి ఉందన్నారు. దీనివలన ప్రజలకు తాగునీరు రైతులకుసాగునీరు అందుతుందన్నారు. వీవిషయమై చర్యతీసుకోవాలని కిషన్‌రెడ్డిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఉదయగిరి కోట విషిష్టతగురించి, అక్కడపర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని నియోజకవర్గ నాయకులు కదిరి రంగారావు కోరగాసానుకూలంగా స్పందిచారన్నారు. ఈ కార్య క్రమంలోహరగోపాల్ రెడ్డి, మాల్యాద్రి, రాజేష్‌నాయుడు, నాగేంద్ర, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## టంకం రాజేశ్వరీకి రసాయన శాస్త్రంలో డాక్టరేట్



**రాపూరు, నవంబరు 7 ప్రభాతవార్త** రాపూరు పంచాయితీ పరిధిలోని రామిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన టంకం రాజేశ్వరీకి రసాయన శాస్త్రంలోడాక్టరేట్‌ను శ్రీ వెంకటేశ్వరా విశ్వవిద్యాలయం వారు పంపిణీ చేశారు. ఎ స్టడి అన్ బయలాలజికల్లీ పోటెన్షియల్‌హెటిరో సైకిల్స్ అనే అంశంపై ఆచార్య వెంకటాపురం పద్మవతి పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంధాన్ని సమర్పించారు. దీంతోరాజేశ్వరీకి యూనివర్శిటి డాక్టరేట్ ప్రధానం చేసింది. తన గ్రంథంలో యంటీ బ్యాక్టిరియల్ మరియు యంటీ ఫంగల్ యాక్టివిటీ గురించి అమే చర్చించారు. రాజేశ్వరీ పరిశోధనా పత్రాలను అనేక జాతియ, అంతర్జాతియ పత్రికలలోప్రచురించడమే కాకుండా ఆమె అనేక సదస్సులలో పాల్గొన్నారు. రాజేశ్వరీకి డాక్టరేట్ రావడం పట్ల ఆమె భర్తవెంకటగిరి నియోజకవర్గ బి.సి నేత అయిన మట్టేం మునిప్రసాద్ ఆనందం వ్యక్తం చేశారు. రాపూరు మండల వాసికి డాక్టరేట్ రావడం పట్ల పలువురు అమెకు అభినందనలు తెలిపారు.

## సబ్‌కలెక్టర్‌కి తెదేపా పిర్యాదు



**కందుకూరు నవంబరు 7, ప్రభాతవార్త:** పట్టణం లోని పోస్టాపీసు సెంటర్‌లో బీఎస్ఎన్ఎల్ కార్యాలయ వద్ద చేపడుతున్న నిర్మాణము అక్రమమని సోమవారం కందుకూరు తెదేపా ఇన్‌చార్జీ ఇంటూరి నాగేశ్వరరావు సబ్‌కలెక్టర్‌కి పిర్యాదు చేశారు. అనుమతిలేని నిర్మాణంపై గత రెండురోజులుగా మున్సిపల్ కమీషనర్‌కి పిర్యా దుచేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ ని ర్మాణం వలన పలు ఇబ్బందులు ఎదురవుతాయ ని, వెంటనే నిర్మాణాలునిలుపుదల చేయాలని ఆయన సూచించారు. పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఇతర నాయకులు ఉన్నారు.

## ఓం నమ శివాయ నామస్మరణ ఎంతో పుణ్యం



**కావలి, నవంబరు 7 ప్రభాతవార్త** నిత్యం వీభూది దారణతో ఓం నమః శివాయ నామస్మరణ ఎంతో పుణ్యమని స్వామి మురళిమోహన్ భక్తులకు తెలిపారు. కావలి పట్టణంలో వేంచేసి వున్న శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం రాత్రి కార్తీక పౌర్ణమి సందర్భంగా మహిళలు ఓం నమః శివాయ మంత్ర జపం చేశారు. కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక మాసంలో ఆచరించాల్సిన పద్ధతుల్ని మహిళలకు మురళీమోహన్ స్వామి తెలియజేశారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారి దగ్గర పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

## షేడ్డు మరమ్మత్తులకు ప్రతిపాదనలు : ఎంపిడిఒ



**ఉదయగిరి నవంబర్ 7ప్రభాతవార్త:** మండలకేంద్రమైన ఉదయగిరిలో గ్రామ పంచాయితీ పరిధిలో ఏర్పాటు చేసిన చెత్త సంపద తయారీ కేంద్ర షేడ్డును సోమవారం ఉదయగిరి ఎంపిడిఒ హైజాక్‌ప్రవీణ్ పరిశీలించారు. పూర్తిగా శిదిలమైపోయిన ఈ షేడ్డును తక్షణం మరమ్మత్తులు చేయవల్సిందిగా దానికి తగినప్రతిపాదనలు సిద్దంగా చేయవల్సిందిగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధీహామి పథకం అదికారులను సూచించారు. ఉపాధీహామి నిధులతో వీలైనంత త్వరగా షేడ్డు మరమ్మత్తులు చేయాలని గ్రామ పంచాయితీ కార్యదర్శికి సూచనలు చేశారు. త్వరలో వర్మికంపోస్టు కూడా తయారు చేయడం జరుగుతుందని ఆయన తెలి పారు .ఈనెలంతా ఇఒపిఆర్‌డి మల్లికార్జున, ఉదయరి పంచాయితీ కార్యదర్శి నరసయ్య, మండల కోఆర్డినేటర్ గాజుల ఇమ్రాన్, తదితరులున్నారు.

## ఎస్టీ జాబితాలోకి చేర్చే జీవో నెంబరు 52ను రద్దు చేయాలి



నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 7, ప్రభాతవార్త: వాల్మీకి బోయ, బెందు బెరియాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబరు 52ను ఉపసంహరించుకోవాలని గిరిజన ఐక్య కార్యచరణ కమిటటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం స్పందనలో జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు కె.సి.పెంచలయ్య మాట్లాడుతూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శ్యామల ఆనందకుమార్‌తో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసి 40 లక్షల జనాభా ఉన్న బోయలను ఎస్టీ జాబితాలో చేర్చితే 32 లక్షల మంది గిరిజన జాతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అన్ని విధాలా అభివృద్ధి చెంది బిసి-ఎ జాబితాలో ఉన్న బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రయత్నించడం సరైన పద్ధతి కాదన్నారు. బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకుని, జీవో నెంబరు 52ను రద్దు చేయాలని కోరారు. ఈ ధర్నాలో గిరిజన ఐక్య కార్యచరణ కమిటీ నాయకులతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన గిరిజనులు పాల్గొన్నారు.

## కండలేరులో 53.02 టీయంసీల నీటిమట్టం

**కండలేరుడ్యాం(రాపూరు), నవంబరు 7 ప్రభాతవార్త** మండలంలలో ని కండలేరు జళాశయంలో సోమవారం ఉదయానికి 53.02 టీయంసీల నీటిమట్టం నమొదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఇందులో వరదనీటి రూపేణా 500 క్యూసెక్కులు, సోమశిల కండలేరు వరద కాలువ ద్వారా 1130 క్యూసెక్కుల చోప్పున జళాశయంలోకి 1630 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వుండగా జళాశయం నుండి లోలెవల్ స్లూయిస్ నుండి 220క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ నుండి 130 క్యూసెక్కుల నీరు, హెడ్ రెగ్యులేటర్ నుండి సత్యసాయి గంగ కాలువలోకి 1400 క్యూసెక్కుల నీరు, పిన్నేరు వాగుకు 150 క్యూసెక్కులు, 1 వ బ్రాంచి కెనాల్‌కు 25 క్యూసెక్కుల చోప్పున మొత్తం 1925 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగావెలుతున్నట్లు తెలిపారు.

## అయ్యప్ప ఆలయంలో స్వాములకు కోనసాగుతున్న అన్నదానం



**రాపూరు, నవంబరు 07 ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులోని శ్రీశ్రీశ్రీ మహావిష్ణువు, శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో కర్తీకమాసం సందర్భంగా అయ్యప్ప స్వాములకు, గోవింద స్వాములకు 12 వ రోజైన సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీ అయ్యప్ప స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేకంగా పలు రకాలైన సుగంధ ద్రవ్యాలు, గంగాజలం, పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక అలంకారం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నంరాపూరులోని మద్దెలమడుగులో నివాసం వుంటున్న సిమెంటు రాళ్ళ వ్యాపారి కోటేశ్వర రావు దంపతులు స్వాములకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం శ్రీ మహావిష్ణువు ఆలయ ధ్వజస్థంబానికి అకాశ దీపం వెలిగించారు. అనంతరం స్వామి వార్ల ఆలయంలో అయ్యప్ప స్వాములు, గోవింద స్వాములు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వాములకురాపూరులోని కాపువీధికి చెందిన బత్తిన రమణా రెడ్డి, సుగుణమ్మ వారి కుమారుడు బత్తిన వెంకటరమణా రెడ్డి, లక్ష్మీదంపతులె స్వాములకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున స్వాములు ఈ కార్యక్రమంలో పాల్గోని పూజలు నిర్వహించి భిక్ష స్వీకరించారు.

## భక్తి శ్రద్ధలతో కార్తీక రెండవ సోమవారం దీపాలు



**రాపూరు, నవంబరు 7 ప్రభాతవార్త** కార్తీక రెండవ సోమవారం, కార్తీక పౌర్ణమి వేడుకలను సోమవారం రాపూరు మండలంలో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం తెల్లవారుజామునే భక్తులు వెలిగోండలలో ప్రవహిస్తున్న కోండేరువద్దకు చేరుకోని కార్తీక స్నానాలు ఆచరించారు. అనంతరం శివాలయానికి చేరుకోని స్వామి వారికి నిర్వహించిన అభిషేకాలను తిలకించారు. సాయంత్రం పెద్ద ఎత్తున మహిళలు శివాలయానికి చేరుకోని దీపాలు వెలిగించి అకాశ దీపాన్ని దర్శించుకున్నారు. మద్దెలమడుగు లోని శ్రీ మహా విష్ణువు, శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకోని పూజలు నిర్వహించారు.

## రాపూరు మండలంలో గ్రాడ్యుయేట్ ఎన్నికలకు 1960 ఓట్లు

**రాపూరు, నవంబరు 7 ప్రభాతవార్త** యంఎల్‌సీ ఎన్నికలకు సంబందించి రాపూరు మండలంలో పట్టభద్రుల ఓట్లు 1960 నమొదు అయ్యాయి. సోమవారం ఓట్లు నమొదుకు చివరి రోజు కావడంతో వెంకటగరి శాసనసభ్యుడు ఆనం రామనారాయణ రెడ్డిఆదేశాల మేరకు రాపూరు మండల పరిషత్ ఆధ్యక్షుడు చెన్ను బాలకృష్ణా రెడ్డి మండలంలోని అన్ని గ్రామాల వారిగాసర్పంచ్‌లు, యంపీటీసీలు, వైసిపి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి, ఆయా గ్రామాలో వున్న గ్రాడ్యుయేట్‌ఓట్లు చేర్పించేలా వారికి ఆదేశాలు ఇవ్వడంతో రాపూరు మండలంలో ఓటరు ధరఖాస్తు చివరి సమయానికి 1960 ఓట్లు నమొదు ఆయ్యాయి.

## పేదలకు దుప్పట్లు పంపిణీ



**బుచ్చి నవంబర్ 7 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెంలోని చెన్నూరురోడ్డులో దర్శి లక్ష్మీనరసయ్య జ్ఞాపకార్ధం వారి కుటుంబసభ్యులు పేదలకు దుప్పట్లు పంపిణి చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా నగరపాలక పంచాయితీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ,కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి,కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ హాజరైయ్యారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడుతు తండ్రిని గుర్తుపెట్టుకొని ఆయన పేరుతో పేదలకు ఇలా దుప్పట్లు,బిస్కెట్లు వంటివి దానం చేయడం అభినందనీయమని ప్రశంసించారు. దర్శి లక్ష్మీనరసయ్య కుమారుడు దర్శిబాల నరసింహరావు ఆద్యాత్మికంగాను ఆయన పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు చాలా అభినందనీయమని అన్నారు.ఈకార్యక్రమంలో సుమారు 80 మందికిపైగా దుప్పట్లు పంపిణి చేశారు.ఈకార్యక్రమంలో దర్శి పద్మావతమ్మ, దర్శిబాలు, దర్శి వెంకటశిరిషా,దర్శి మహేష్,దర్శి మేఘన,ఆర్యవైశ్య ప్రముఖులు పైడారవి,దర్శి చిన నరసింహులు, మెగళ్లూరుబాబు,సప్తగిరి వెంకటేశ్వర్లు,తిరివీధి రాజా,గుబ్బా సూరినారాయణ తదితరులు పాల్గోన్నారు.

## పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఆర్టీసి పాసులు పంపిణీ



**కావలి రూరల్, నవంబరు 7 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఓబిసి ఉపాధ్యక్షులు, పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ సహకారంతో ట్రస్ట్ సభ్యులు బేతాని శ్రీనివాస్ చేతుల మీదుగా సోమవారం కావలి రూరల్ మండలం రామచంద్రాపురం గ్రామంలోని మాతిన నాగమణి కుమారుడు మాతిన శ్రీనివాస్ కావలి నుండి కొండాపురం వెళ్లేందుకు ఆర్టీసి ఉచిత బస్సు పాసును అందజేశారు. అలాగే కొంతమంది విద్యార్థులకు కూడా ఉచిత బస్సు పాసులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## నూటికి నూరు శాతం ప్రతి ఒక్కరు చదువుకోవాలి



**కావలి రూరల్, నవంబరు 7 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ పరిధిలో నూటికి నూరు శాతం ప్రతి ఒక్కరు చదువుకొని వుండాలని, కనీసం వారి పనులు వారు చేసుకునే విధంగానైనా వుండాలని కావలి ఎంపిడివో అమ్మిశెట్టి వెంకట సుబ్బారావు తెలిపారు. కావలి ఎంపిడివో కార్యాలయంలో అక్షర చైతన్యం రెండవ దశ కార్యక్రమంపై వెల్ఫేర్ అసిస్టెంట్లకు, మహిళా పోలీస్ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడివో అమ్మిశెట్టి మాట్లాడుతూ బ్యాంకుకు వెళ్ళేటప్పుడు కనీస పరిజ్ఞానం కలిగి వుండే విధంగా ప్రజలను తీర్చిదిద్దాల్సిన అందరిపై వుందన్నారు. జిల్లా కలెక్టర్ మానస పుత్రిక అయిన అక్షర చైతన్యం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వయోజన విద్యాశాఖ సంచాలకులు నారాయణ చదువుకుందాం రా ఒకటి, రెండవ వాచకంపై శిక్షణ ఇచ్చారు. త్వరలోనే గ్రామ సచివాలయంలో నిరక్షరాస్యులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కనిగిరి రిజర్వాయర్‌ని పర్యాటక కేంద్రంగా చేయండి

**బుచ్చి నవంబర్ 7 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న కనిగిరి రిజర్వాయర్‌ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని బిజెపి జిల్లా కార్యదర్శి కాసా శ్రీనివాసులు, ఎస్సీ మోర్చ జిల్లా ఉపాధ్యాక్షులు గోళ్లనరసింహులు బిజెపి కార్యకర్తలు కేంద్ర పర్యాటక శాఖా మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందించినట్లు వారు తెలిపారు.ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గోన్నారు.

## నాడు-నేడు పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి



**కోవూరు, నవంబరు7 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గానూ ప్రవేశపెట్టిన నాడు-నేడు పథకం కింద ఏపట్టే పనుల్లో నిర్దేశించిన ప్రమాణాలు తప్పనిసరి అని ఎంపీడీవో శ్రీహరి పేర్కొన్నారు. కోవూరు మండలం పాటూరు పంచాయతీ పరిధిలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు రికార్డులను వెలుగు ఏపీఎం వెంకటస్వామితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలన్నారు. ఎక్కడా కూడా మెనూలో తేడా లేకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా సంబంధించిన ఏజెన్సీలు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఎమ్మెల్సీ ఓటు నమోదుకు సంబంధించి 9503 దరఖాస్తుల స్వీకరణ



**కోవూరు, నవంబరు7 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించి త్వరలో జరగనున్న తూర్పు రాయలసీమ పట్టభద్రుల , ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం నాటికి ఓటు నమోదుకు సంబంధించిన మొత్తం 9503 దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని తహసీల్దార్ ఎం.పద్మజ తెలిపారు. సోమవారం కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా ఫారం-18కి సంబంధించిన దరఖాస్తులు 6463, ఆఫ్‌లైన్ ద్వారా 3040, ఈఆర్‌ఎంఎస్ ద్వారా 527దరఖాస్తులను స్వీకరించడం జరిగిందన్నారు.. . వచ్చిన దరఖాస్తులు అన్నింటిని ఆన్‌లైన్ నమోదు చేయడం జరిగిందన్నారు.

## పిల్లల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



**కోవూరు, నవంబరు7 ప్రభాతవార్త :** కోవూరులోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యను అభ్యసిస్తున్న పిల్లల సంరక్షణపై సంబంధిత సంక్షేమాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని లోక్ అదాలత్ సభ్యుడు న్యాయవాది రాంబాబు తెలిపారు. కోవూరులోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో పాన్ ఇండియా అవుట్ రీచ్ ప్రోగ్రామ్‌లో భాగంగా కోవూరు మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. అదేవిధంగా బాలల హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమాధికారి వెంకట్రావు, విద్యార్థులు ఉన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలి



**నెల్లూరు టౌన్, నవంబరు 7, ప్రభాతవార్త:** అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలని జిల్లా స్త్రీ శిశు అభివృద్ధి, సాధికారత అధికారిణి కె.సౌజన్య అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రమైన నెల్లూరులోని వీడియోస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో జిల్లాలోని సీడీపీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు మెనూ ప్రకారం గర్భవతులకు, బాలింతలకు, 6 సంవత్సరాల లోపు పిల్లలకు ఆహారం అందించాలన్నారు. జిల్లాలోని 33 అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్లుగా ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యకర్తలకు ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు మహిళా ప్రాంగణము నందు శిక్షణా తరగతులు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీయస్ సీడీపీవోలు పాల్గొన్నారు.

## రైతులను మోసం చేసిన వడ్ల వ్యాపారిపై చర్యలు తీసుకోండి




**నెల్లూరు టౌన్, నవంబరు 7, ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా మనుబోలు మండలంలో ఓ వడ్ల వ్యాపారి పలువురు రైతులను మోసం చేసి కష్టపడి పండించుకున్న ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా ఉడాయించాడని అతనిపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు బాధిత రైతులు విజ్ఞప్తి చేశారు. సోమవారం నెల్లూరు నగరంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బాధిత రైతుల విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ మనుబోలు మండలానికి చెందిన వడ్ల వ్యాపారి మండలంలోని సుమారు 50 మంది పైగా రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేస సంబంధిత రైతులకు నగదు ఇవ్వకపోగా అదే నగదుతో బెంగుళూరు ఉడాయించి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని తమ ఆవేదన వ్యక్తపరిచారు. ఈ విషయమై సోమవారం ఎస్పీ ఆఫీసు స్పందనలో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఆ వ్యాపారికి రాజకీయ అండ ఉన్నందున అతని మీద ఫిర్యాదులు తీసుకోవడంలేదని, గతంలో స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఆ వడ్ల వ్యాపారిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## అగ్రవర్ణాల రిజర్వేషన్లపై కోర్టు తీర్పు హర్షదాయకం

**నెల్లూరు టౌన్, నవంబరు 7, ప్రభాతవార్త:** అగ్రవర్ణాల పేదలకు కల్పించిన ఈడబ్ల్యూఎస్ కోటా కింద 10 శాతం రిజర్వేషన్లు వ్యతిరేకిస్తూ సవాలు చేసిన పిటిషన్‌ను భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేయడం ఎంతో హర్షదాయకమని సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ఎస్వీఎస్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం నాడు ఆయన ఒక ప్రకటన విడుద ల చేశారు. అన్ని వర్గాలలోను పేదలు ఉన్నారని ఇలాంటి పరిస్థితుల్లో కులం చూడకూడదని నిరుపేద అగ్రవర్ణాలకు కూడా విద్య, ఉద్యోగాలలో ఈడబ్ల్యూఎస్ కోటా కింద 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం పట్ల అత్యున్నత న్యాయస్థానం సమర్థించిందన్నారు. 103వ రాజ్యాంగ సవరణకు సుప్రీం కోర్టు సమర్థించింది. ఈ తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులకు ఓసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ఎస్.వి.సుబ్రహ్మణ్యంరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ తీర్పు వలన అగ్రవర్ణాల పేదలకు న్యాయం చేకూరుతుందని హర్షం వ్యక్తం చేశారు. ఈఆర్‌డబ్ల్యూఎస్ కోటా అమలు కోసం ఎంతో కాలం నుంచి ఓసి సంక్షేమ సంఘం పోరాటం చేస్తుందని, అందు కోసం కృషి చేసినటువంటి తమ ఓసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జి.కరుణాకర్‌రెడ్డికి అభినందనలు తెలియజేశారు. అనేక దశాబ్దాలుగా అగ్రవర్ణాల నిరుపేదలు తినడానికి తిండి లేక, ఉండడానికి ఇల్లు లేక ఉన్నత చదువులు చదువుకోలేక, ఉన్నత చదువులు చదువుకొని మంచి మార్కులు సంపాదించినప్పటికీ ఉద్యోగాలు పొందలేక ఎంతో మంది పేదలకు ఎంతో నష్టం జరిగిందని, ప్రతిభ కలిగిన నిరుపేద అగ్రవర్ణాలకు విద్యార్థులకు దీని ద్వారా కొంతవరకైనా మేలు జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలి



**కోవూరు, నవంబరు7 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని ప్రాంతాల్లో పాత కేసులకు సంబంధించిన నేరస్తులపై సంబంధిత ప్రాంతాల్లోని మహిళా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోవూరు ఎస్సై డి. వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో సోమవారం మహిళా పోలీసులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు తిరుగుతుంటే వెంటనే ఆ సమాచారాన్ని పోలీస్‌స్టేషన్‌కు చేరవేయాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ఎక్కడైనా పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు మీ దృష్టికి వస్తే అటువంటి వాటిపై నిఘా ఉంచాలన్నారు. అదేవిధంగా పాత నేరస్తుల కదలికపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమీక్షలో మండలంలోని అన్ని సచివాలయాల మహిళా పోలీసులు ఉన్నారు.

## కార్తీక పౌర్ణమి సందర్భంగా కిక్కిరిసిన శివాలయాలు



**కలిగిరి, నవంబర్07, ప్రభాతవార్త;** కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయాలు బక్తులతో కిక్కిరిసి పోతున్నాయి. అడుగడుగునా బక్తులు కార్తీక దీపాలతో ఓం నమ:వివాయా! అంటూ శివనామ స్మరణతో ఆలయాలు మార్మోగుతున్నాయి. కార్తీక పౌర్ణమి మండలశవారం జరప వలసి ఉండగా గ్రహణం వలన ఆగమ పండితులు సలహామేరకు బక్తులు సోమవారం చేసుకుంటున్నారు.కార్తీకమాసం ,సోమవారం, కార్తీక పౌర్ణమి మూడు పర్వదినాలు కలసి రావడం మహిళలు పెద్దఎత్తున కార్తీక దీపాలు వెలిగించడంతో శైవక్షేత్రాలు అఖండ దీపాన్ని తలపిస్తున్నాయి.సోమవారం ఉదయం సూర్యోదయంనుండి శివాలయాల్లో బక్తులు అత్యంత భక్తి శ్రద్దలతో దీపాలు వెలిగిస్తున్నారు. కలిగిరి లోని శ్రీ పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్తానముల్లో బక్తులు చుట్టూ గ్రామాల నుండి తరలివచ్చి కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు.మండలంలోని శిద్దన కొండూరులోని శ్రీ శిద్దేశ్వర స్వామి దేవస్తానముల్లో వెలగపాడులోని శ్రీభ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి దేవస్తానముల్లో,చిన్న అన్నలూరు పంచాయితీ అగ్రహారంలోని శ్రీ భైరవేవ్వర దేవస్తానములో కార్తీక పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. మహిళలు పెద్దఎత్తున శివాలయాలను దర్శించి కార్తీక దీపారాదన అనంతరం ఒక్కపొద్దులు చెల్లించారు. శివునికి ఎంతో ప్రీతి పాత్రమైన కార్తీక దీపారాదన కార్యక్రమంలో బక్తులు పెద్దఎత్తున పాల్గోని స్వామివారి ఆశ్శీసులు పొందారు.

## తోపుగుంట ఆర్‌బికెలో సజ్జల కొనుగోలు కేంద్రం ప్రారంభం



**కలువాయి నవంబర్ 7 ప్రభాతవార్త:** కలువాయి మండలం తోపుగుంట ఆర్‌బికెలో సజ్జల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మార్క్‌ఫెడ్ డిఎం పవన్ ,జడ్‌పిటిసి మెంబర్ బులగాకుల అనీల్‌కుమార్‌రెడ్డి ,ఎంపిపి ఆర్ లక్ష్మీదేవి మండల వ్యవసాయాధికారి వి ప్రతాప్ లాంచనంగా ప్రారంభించారు.గత ఖరీప్ సీజనలో సాగు చేసిన సజ్జలను రైతుల దగ్గర నుండి ఏపి మార్క్‌ఫెడ్ నాణ్యతా ప్రమాణాలకు అణుగుణంగా ఒక క్వింటాకి 2350 రూపాయాలు మద్దతు ధర ఇచ్చి రైతుల వద్ద నుండి కొనుగోలు చేయడం జరుగుతుందని డిఎం పవన్ తెలిపారు. సిఎం ఏపిపిలో కొనుగోలుకు సంబంధించి గ్రామ వ్యవసాయ సిబ్బంది దగ్గర రైతులు ఆధార్ పాసుబుక్ పోన్ నెంబర్‌తో బ్యాంకు వివరాలను రిజిష్టేషన్ చేయించుకోవాలని సజ్జల కొనుగోలుకు సంబంధించి రిజిష్ట్రేషన్ చాలా వరకు పూర్తి అయిందని ఏఒ ప్రతాప్ తెలిపారు.ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సజ్జలు వేసిన ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని నాణ్యత ప్రమాణాలకు అణుగుణంగా విత్తనాలు కొనుగోలు చేస్తారని రైతులు జాగ్రత్తలు పాటించి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అనీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.ఈకార్యక్రమంలో తోపుగుంట ఎంపిటిసి మాదాల పెంచల నరసింహప్రసాద్, ఏఎబి చైర్మన్ మన్నె చంద్రబాబు,వైసిపి నాయకులు నాపారాఘవేంద్ర,ఎర్రమనేని వెంకటేశ్వర్లు ,రమేష్, పాములపాటి లక్ష్మయ్య, రైతులు పాల్గోన్నారు.

## బోగోలులో ఘనంగా కార్తీకపౌర్ణమి



**బిట్రగుంట,నవంబర్7,ప్రభాతవార్తః** మండలకేంద్రమైన బోగోలులో ఘనంగా సోమవారం కార్మీకపౌర్ణమి పర్వదినాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు.బోగోలులోని షిరిడిసాయిబాబా మందిరంలో ను,విశ్వనాదరావుపేట,రామస్వామిపాళెం రామలింగేశ్వరస్వామి దేవస్తానాలలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు.రామస్వామిపాళెంలోని రామలింగేశ్వరస్వామి దేవస్తానంలో రుద్రాభిషేకం కూడా నిర్వహించారు.భక్తులకు ఆలయ వ్యవస్తాపక అధ్యక్షుడు బత్తల.రవిచంద్ర ఆద్వర్యంలో తీర్దప్రసాదాలు పంపిణీచేశారు.

## ఎల్.ఆర్ అగ్రహారం సర్పంచ్ శంకరయ్య మృతి



**జలదంకి,నవంబర్7,ప్రభాతవార్తః** జలదంకి మండలం లింగరాజుఅగ్రహారం సర్పంచ్ పరసు.శంకరయ్య గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఇటీవల కాలంలో ఆయన అనారోగ్యంతో బాదపడుతున్నాడు.పలు ఆసుపత్రులలో చికిత్స పొందాడు.అకస్మాత్తుగా హార్ట్‌అటాక్‌కు గురై తుదిశ్వాసవిడచినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలియజేశారు.పెద్దాయన వై.ఎస్.ఆర్ కాంగ్రేస్‌పార్టీ సీనియర్‌నేత మృతిచెందాడని తెలియడంతో మండల వై.సి.పి శ్రేణులు దిగ్బ్రాంతి చెందారు.పలువురు మండల నేతలు తమ సంతాపాన్ని వ్యక్తంచేశారు.కావలి శాసనసభ్యుడు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి,మాజీ ఎ.ఎమ్.సి చైర్మన్ సుకుమార్‌రెడ్డిలు ఆయన స్వగ్రామమైన ఎల్.ఆర్ ఆగ్రహారం వెళ్ళి నివాళులర్పించారు.ఆయన కుటుంభసభ్యులకు తమ ప్రగాడ సానుభూతిని తెలియజేశారు.

## సిసిరోడ్డు కు శంఖుస్థాపన నేడే



**వింజమూరు,నవంబర్7,ప్రభాతవార్త:** వింజమూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్ళే రహదారి ఏర్పాటుకు మంగళవారం కలెక్టర్, ఎమ్మెల్యేలు శంఖుస్థాపన గావిస్తారని ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ డిఇ ఎం.సాంబశివరావ్ తెలిపారు. సోమవారం వింజమూరులోని సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిఎంఐసి ద్వారా 50లక్షల రూపాయల వ్యయంతో 330మీటర్లు పొడవు, 7-50మీటర్ వెడల్పు కలిగినసిసిరోడ్డు నిర్మాణం జరగనుందన్నారు. ఈనిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభిస్తామన్నారు. ఈకార్యక్రమంలో జెఇ ప్రసాద్, స్థానిక సొసైటీ చైర్మెన్ జూపల్లి రాజారావ్, మండల కన్వీనర్ రేవనూరు శ్రీనివాసులురెడ్డి, నాయకులు అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, బయపురెడ్డి విజయ్‌కృష్ణారెడ్డి, భోజనపు ఆనంద్, రావూరు పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు .

## సర్వోన్నత న్యాయస్థానం తీర్పు చారిత్రాత్మకమైనది



**వింజమూరు,నవంబర్7,ప్రభాతవార్త:** సర్వోన్నత న్యాయస్థానం తీర్పు చారిత్రత్మకమైనది. దేశంలోని అగ్రవర్ణ పేద విద్యార్థిని, విద్యార్థులకు ఇడబ్ల్యుఎస్ఎస్ రిజర్వేషన్ కు రాజ్యాంగబద్ధత కల్పిస్తూ సర్వోన్నత న్యాయస్థానం తీర్పు చెప్పడం హర్షణీయమని బ్రాహ్మణ సంఘ నాయకుడు పసుపులేటి భవాని శంకర్‌శర్మ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోడి అగ్రవర్ణ పేదలను దృష్టిలో ఉంచుకొని ఈ అవకాశాన్ని కల్పించేందుకు కృషి చేశారన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో 10శాతం అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా అగ్రవర్ణాల పేదల జీవితాల్లో వెలుగులు విరజిమ్ముతాయన్నారు .విద్యార్థులకు, ఉద్యోగ ఆశావాహులకు ఈ రిజర్వేషన్లు ఎంతో ఉపయోగకరమన్నారు

## అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



**వింజమూరు,నవంబర్7,ప్రభాతవార్త:** వింజమూరు పోస్టాఫీసు వీధిలోని అయ్యప్పస్వామి ఆలయంలో కార్తీకసోమవారాన్ని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఉభయదాతలుగా బూసి రమణారెడ్డి ధర్మపత్ని రాధ, కుమార్తెలు మోక్షిత, వెంకట జోషిక లు వ్యవహరించారు. ముందుగా ఆలయంలోని పార్థివ శివలింగానికి పాలాభిషేకం , చందనాభిషేకం, భస్మాభిషేకం, కుంకుమాభిషేకం, బిల్వపత్రాభిషేకం నిర్వహించారు. వినాయకుని అష్టోత్రం, సుబ్రహ్మణ్యం స్వామి పూజలు నిర్వహించారు .ఉభయదాత రమణారెడ్డి మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో గురుస్వాములు చేబ్రోలు వసంతరావ్, ఎసిడిసి ప్రసాద్, పూర్ణా, మస్తాన్‌రెడ్డి, దేవర, దేవీ, మనం హరీష్, వెలుగోటి కృష్ణ, శ్రీకళ రమేష్ , భక్తులు పాల్గొన్నారు ..

## శ్రీమల్లికార్జునస్వామి ,కామాక్షితాయి సన్నిధిలో మహారుద్రహోమం



**బుచ్చి నవంబర్ 7 ప్రభాతవార్త** కార్తిక సోమవారం, కార్తికపౌర్ణమి పురస్కరించుకొని జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి,కామాక్షితాయి సన్నిధిలో మహారుద్రహోమం నిర్వహించారు. స్వామి వారికి ఉదయం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, సహస్రనామార్చనపూజలు, నిర్వహించారు. అలాగే గోపూజ,గణపతిపూజ, పూన్యాహవచనం,కలశస్థాపన,లక్ష్మీగణపతిహోమం మృత్యుంజయ సహితమహారుద్రహోమం,నవగ్రహోమం, పూర్ణాహుతి, కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం భక్తులకు రక్షాధారణ,హోమరక్ష, కలశజలం, ప్రసాదం



భక్తులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేశారు.ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా బెంగుళూరుకి చెందిన సూరపనేని శుభకర్ సతీమణి హేమమాలిని ఉభయకర్తలుగా వ్యవహారించారు.హోమం అనంతరం భక్తులు కొబ్బరికాయాలు,హోమసామాగ్రిని హోమంలో వేశారు.

**అర్చకులు,ట్రస్టుబోర్డు సభ్యుల సేవలు అభినందనీయం** జొన్నవాడ కామాక్షితాయి సన్నిధిలో అర్చకుల సేవలు,వారి పూజా విధానం అద్భుతంగా ఉంటుందని ఉభయకర్త సూరపనేని హేమమాలిని ప్రశంసించారు.ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతు జొన్నవాడ దేవస్థానంలో అర్చకులు పూజా విధానం ఎంతో మనస్సుకి ప్రశాంతత ఆనందాన్ని కలుగ చేస్తాయని ఆమె వారిని అభినందించారు.ట్రస్టుబోర్డు చైర్మన్ పుట్టా సుబ్రమణ్యం నాయుడు,పాలక మండలి సభ్యులు ఆలయాభివృద్ధికి చేస్తున్న కృషి అద్భుతమని వారిని అభినందించారు.అనంతరం చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతు శ్రీమల్లికార్జునస్వామి,కామాక్షితాయి కృపాకటాక్షాలతో , కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆశీస్సులతో ,దాతల సహకారంతో,శక్తివంచనలేకుండా ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన చెప్పారు.ఈకార్యక్రమంలో చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రమణ్యంనాయడు దంపతులు, ఆలయ ఇఒ డబ్బుగుంట వెంకటేశ్వర్లు ,పాలక మండలి సభ్యులు తిరువాయి పాటి నందకుమార్, ముంగరశివకుమార్ ,తిరుమూరు సుప్రజ, గుంటూరు కామేశ్వరీ,ఎ క్స్ అఫిషియో సభ్యులు శ్రీశైలం శశిశేఖర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఉపాధ్యాయ సంఘం అభ్యర్ధి బ్రహ్మనందంను గెలిపించాలి



**కావలి, నవంబరు 7 ప్రభాతవార్త** తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అభ్యర్ధి, కావలి బిజెపి పట్టణ అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మనందానికి ఉపాధ్యాయులందరూ ఓటు వేసి గెలిపించాలని కేంద్ర సాంస్కృతిక శాఖ, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. సోమవారం నెల్లూరు టౌన్ హాలులో జరిగిన తూర్పు రాయలసీమ, పట్టభద్రుల ఆత్మీయ సమావేశంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్ధిగా కుట్టుబోయిన బ్రహ్మనందంను మంత్రి ప్రకటించారు. కావలి ఎబివిపి పూర్వ కార్యకర్త, విద్యావంతుడు, విద్యార్ధి నాయకుడు కుట్టుబోయిన బ్రహ్మనందం గెలుపుకు ఉపాధ్యాయులందరూ కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల దాదాపు పది లక్షల ఉద్యోగాలను నిరుద్యోగ నిర్మూలనకు భర్తీ చేసే కార్యక్రమం చేపట్టిందని మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బిజెపి క్రమశిక్షణ సంఘం రాష్ట్ర సభ్యులు కందుకూరి వెంకట సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి అంచిపాక కమల, జిల్లా అధ్యక్షులు గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ నారాయణరెడ్డి, సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భవితా కేంద్రాన్ని సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్



**బుచ్చి నవంబర్ 7 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని భవితాకేంద్రాన్ని అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి సందర్శించారు.ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతు ప్రత్యే అవసరాలు గల పిల్లలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రకాలుగా ఆదుకుంటుందని ఆమె తెలిపారు. భవితాకేంద్రంలో పిల్లలకు ఏ విధంగా విద్యను బోధిస్తున్నారు. ప్రతి వారం ఫిజియోదెరిఫి వైద్యశిబిరం నిర్వహిస్తున్నారాలేదా తదితర అంశాలపై అడిషనల్ ప్రాజక్టు కోఆర్డినేటర్ ఉషారాణిని అడిగి తెలుసుకున్నారు.భవితాకేంద్రానికి సంబంధించి రికార్డులను పరిశీలించారు.ఈ సందర్బంగా పిల్లల తల్లిదండ్రులు పలు సమస్యలు ఆమె దృష్టికి తీసుకొని వెళ్లారు. మరుగుదొడ్లు సౌకర్యం లేవని,స్పీచ్ తెరఫిస్ట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.దీనిపై ఆమె స్పందిస్తు సంభందిత అధికారులకు సమా చారం అందించి ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. వీరి వెంట కో ఆర్డినేటర్ ధనమ్మ, ఎంఇఒ దిలీప్‌కుమార్, భవితాకేంద్రం టీచర్లు శేషమ్మ, శ్రీనివాసులురెడ్డి తదితరులున్నారు.

## కార్తీక పౌర్ణమి సోమవారం భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



**కావలి, నవంబరు 7 ప్రభాతవార్త** కార్తీక సోమవారం రోజున పౌర్ణమి కూడా రావడంతో భక్తులు శివాలయాలకు పోటెత్తారు. కావలి పట్టణంలోని శ్రీ దుర్గాభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి (కావలి శివాలయం) ఆలయంలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి శివ పార్వతులను దర్శించుకున్నారు. శివాలయ ఆలయ ప్రాంగణం కార్తీక దీపాల వెలుగులో అలరారింది. ఆల యంలో తిరిగేందుకు కూడా వీలు లేకుండా భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. క్యూలో భక్తులు శివపార్వతుల్ని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ అనువంశిక అర్చకులు ఎ.ఆర్.శశిధర్‌గురుకుల్ (శశిస్వామి) భక్తులకు అసౌకర్యాలు కలగకుండా సౌకర్యాలు కల్పించారు. శివాలయ నటరాజస్వామి భక్త బృందం భక్తులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందజేస్తూ శివపార్వతులను దర్శించుకునేలా కృషి చేశారు. కార్తీక పౌర్ణమి సోమవారం రావడంతో విశేషంగా భక్తులు ఉపవాసాలు వుండి పూజలు చేశారు. పట్టణంలోని శివాలయాలలో,వివిధ ఆలయాలలో కార్తీక పౌర్ణమి పూజలు నిర్వహించి దీపాలు వెలిగించారు.

## భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం



**అనంతసాగరం,నవంబర్7,ప్రభాతవార్త:** అనంతసాగరం మండలం సోమశిల గ్రామంలోని శ్రీసోమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులు కార్తీకపౌర్ణమి, రెండవకార్తీక సోమవారాన్ని భక్తిశ్రద్ధలతోనిర్వ హించారు. ఈసందర్భంగా పెన్నానదిలో స్నాన మాచరించి ఆలయంలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు వెఙుతుర్ల బాలకృష్ణారెడ్డి, సతీమణి ప్రసన్న , కుమారుడు సాయికృష్ణ, కుమార్తె నిఖిత ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమం ఆలయ ధర్మకర్తలు, మాజీ సర్పంచ్ ఉప్పల విజయ్‌కుమార్ చేతులమీదుగా భక్తులకు అందించారు. వైసిపి నాయకులు గుండుబోయిన కృష్ణయ్య, బత్తల నరేష్, లంకామల్లారెడ్డి పాల్గొన్నారు.

## నీలం మస్తానయ్య మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే రామిరెడ్డి



**అల్లూరు, నవంబరు 7 ప్రభాతవార్త** అల్లూరు మండల వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు నీలం సాయికుమార్ తండ్రి నీలం మస్తానయ్య ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డిలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయికుమార్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం మస్తానయ్య అంత్యక్రియలలో స్థానికులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



**కోవూరు, నవంబరు7 ప్రభాతవార్త :** కోవూరు సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో అన్ని గ్రామ సచివాలయాల ప్రాంతాల్లో నిర్మాణం చేపడుతున్న సీఎస్‌సీ మరుగుదొడ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి అని గృహ నిర్మాణ శాఖ డీఈ లీలాప్రకాష్ అన్నారు. కోవూరులోని డీఈ కార్యాలయంలో సోమవారం ఏఈలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్‌కు సంబంధించి 77 సీఎస్‌సీలు మంజూరు కాగా అందులో 27 నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అదేవిధంగా జలజీవన్ మిషన్‌కు సంబంధించి సబ్ డివిజన్ పరిధిలో చేపట్టే పనులు ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి నాణ్యతగా నిర్మించాలన్నారు. అదేవిధంగా నవంబర్ నెలాఖరు లోగా ఇచ్చిన లక్ష్యాలు పూర్తయ్యేలా ఏఈలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమీక్షలో ఏఈలు జగదీష్, వినయ్, హరికృష్ణ, తదితరులు ఉన్నారు.

## వైభవంగా కార్తీక పౌర్ణమి



**కోవూరు, నవంబరు7 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో కార్తీక మాసంలో వచ్చే కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాధం సుబ్బరామయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న భక్తులందరికీ ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పర్వదినం సందర్భంగా మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాన్ని కన్నులపండువగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఆలయ చైర్మన్ బి. సురేష్, ధర్మకర్తలు ఏ. హనుమారెడ్డి, పి. మోహన్, నాగరాజు, సాయి యశ్వంత్‌రెడ్డి, జగదీష్‌స్వామి , బాషా, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



**నెల్లూరు నవంబర్ 7, ప్రభాతవార్త-వైద్యం** ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నగరంలో ఉన్న క్యాన్సర్ ఆసుపత్రిలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి రోజురోజుకు ఎక్కువగా ప్రబలుతుందని, ప్రపంచంలోనే ప్రస్తుతం 10 మిలియన్ల మందికిపైగా ఈ వ్యాధి బారినపడతున్నారన్నారు. ఆ వ్యాధి నుంచి నియంత్రించాలంటే తినే ఆహారము, పీల్చేగాలి, త్రాగే నీరు, కలుషితం కావడం వలన వ్యాధి బారినపడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు జంక్ ఫుడ్ మాని ఇంట్లో చేసిన మంచి ఆహారము తినడము, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినడము, నిత్యం వ్యాయామం, ప్లాస్టిక్ వస్తువుల వాడకం మానడం, పొగాకు మానడం లాంటివి పూర్తిగా మానేస్తే ఈ వ్యాధి బారినపడకుండా ఉండొచ్చన్నారు. తొమ్మిది ఏళ్ళుపై బడిన ఆడ, మగ పిల్లలకు హెచ్‌పివి, వ్యాక్సిన్, హెపటైటిస్ బి(హెబిస్ ఏజి) వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. వివాహితలు పిఏపి పరీక్ష, పొట్ట, రొమ్ము స్కాన్‌లను నెలకొకసారి పరీక్షించుకోవాలన్నారు. 40 ఏళ్ళుపై బడిన తరువాత మెమోగ్రామ్, ఎక్స్‌రే తీయించుకోవాలని వివరించారు. పురుషులు 40 ఏళ్ళ తరువాత పొట్ట, పిఎస్ యాన్‌టీ బాడీ పరీక్ష చేసుకుంటే క్యాన్సర్‌ని నియంత్రించవచ్చన్నారు. ఈ వ్యాధిని మొదటి దశలో కనుగొన్నా కూడా పూర్తిగా నయం చేయవచ్చని వెల్లడించారు. ఈ సదస్సులో డాక్టర్ లక్ష్మి, డాక్టర్ గీతఉషశ్రీ, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ లోకేశ్వరి, డాక్టర్ తేజేశ్వర్ పాల్గొన్నారు.

## శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో అఖండజ్యోతి



**బుచ్చి నవంబర్ 6 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని రామకృష్ణానగర్‌లో కొలువైవున్న శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో కార్తిక సోమవారం పురస్కరించుకొని వేలాది మంది భక్తులు స్వామి వారి సన్నిధిలో ఏర్పాటు చేసిన అఖండ జ్యోతిని దర్శించుకున్నారు.అఖండజ్యోతి ఆవునెయ్యితో ఏర్పాటు చేశారుజ ఆలయం వద్ద జ్వాలా తోరణం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా దర్శి బాలనరసింహరావు, ధర్మపత్ని వెంకటశిరిషా, కుటుంబసభ్యులు వ్యవహారించారు. దేవస్థాన కమీటి అఖండ జ్యోతి (కర్పూరజ్యోతిని) ప్రజ్వలన చేశారు. అనంతరం స్వామి వారికి ఉంజలసేవ నిర్వహించారు. అర్చకులు కార్తికమాసం యొక్క విశిష్టత గురించి వివరించారు.

## డీఈ సుధాకర్‌కు కార్పొరేషన్ నివాళి



**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 7,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన డేవిడ్ సుధాకర్‌కు కమిషనర్ డి.హరిత, అధికారులు, సిబ్బంది నివాళులు అర్పించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొని ఆయన చిత్రపటానికి పూలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం నగరపాలక సంస్థకు డీఈ హోదాలో డేవిడ్ సుధాకర్ అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డీఆర్‌డీవో సలహాదారుడికి వీడ్కోలు



**నెల్లూరు అర్బన్ నవంబరు 7, ప్రభాతవార్త:** జిల్లాలో పర్యటన చేస్తున్న డీఆర్‌డీవో సలహాదారుడు డాక్టర్ సతీష్‌రెడ్డి సోమవారం వీడ్కోలు పలికారు. డాక్టర్ సతీష్‌రెడ్డి జిల్లాలో మూడు రోజుల పర్యటన పూర్తి చేసుకున్నారని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎ.సురేష్‌కుమార్ తెలిపారు.గత మూడు రోజుల నుంచి అతని వెంటే ఉంటూ పర్యటన దిగ్విజయంగా పూర్తి చేశారు. పర్యటన దిగ్విజయంగా పూర్తి చేశారు. విమానాశ్రయంలో శాలువా కప్పి పుష్పగుచ్ఛము అందజేసి ఇచ్చి వీడ్కోలు పలికారు.

## అన్సారీ గ్రంథాలయానికి ఇనుప అరలు బహుకరణ



**నెల్లూరు టౌన్, నవంబరు 7, ప్రభాతవార్త:** నెల్లూరు నగరం ప్రెస్‌క్లబ్‌లోని జస్టిస్ ఎంఆర్ఎ అన్సారీ స్మారక గ్రంథాలయానికి అన్సారీ కుమార్తె ఫరిదా హుస్సేన్ సోమవారం పుస్తకాలు భద్రపరిచే ఇనుప అరలు రెండింటినీ బహుకరించారు. తన తండ్రి అన్సారీ జయంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థంగా వీటిని అందజేయడం జరిగిందని ఫరిదా పేర్కొన్నారు. ఇటీవల తాను గ్రంథాలయానికి సందర్శించినప్పుడు ప్రభుత్వం 2వేల పుస్తకాలు త్వరలోనే సరఫరా చేయనున్నట్లు వాటిని భద్రపరిచే అరలు లేవని గ్రంథాలయం ఉరుస్తోందని, పాఠకులు కూర్చునేందుకు సరిపడా కుర్చీలు అవసరమై ఉన్నాయని, దాతలు ముందుకొచ్చి గ్రంథాలయానికి మరమ్మతులు చేయించి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రంథాలయం అధికారిణి చంద్రగిరి ఈశ్వరమ్మ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 55వ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమము నిర్వహిస్తామని పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వారోత్సవాలు పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఆర్ స్పాస్టిక్ సెంటర్ వైద్యులు డాక్టర్ నవీత్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ఖాదర్‌బాషా, స్థానిక గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

## శ్రీ దక్షిణామూర్తికి విశేష ద్రవ్యాలతో అభిషేకం



**సైదాపురం, నవంబరు 7, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సైదాపురంలోని సిద్ధలయ్య కోనలో వెలసియున్న శ్రీ మేధా దక్షిణామూర్తి స్వామి వారికి కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా దేవస్థానం వ్యవస్థాపకులు పాలడుగు వెంకట సాయి దంపతుల ఆధ్వర్యంలో విశేష ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దక్షిణామూర్తి స్వామి దేవస్థానం నందు గల శివలింగముకు అమెరికాలో నివాసముంటున్న జమ్మి రవీంద్రనాథ్, సుగుణ కుటుంబసభ్యులు వెండి నాగాభరణం బహుకరించారని దేవస్థానం వ్యవస్థాపకులు వెంకటసాయి తెలిపారు. అదేవిధంగా యాగ మండపము నందు శ్రీ లక్ష్మీ గణపతి హోమం, శ్రీ శివపాసుపత హోమం, శ్రీ దుర్గాదేవి హోమాలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## సిద్ధలయ్య కోనలో కార్తీకమాస మహోత్సవాలు



**సైదాపురం, నవంబరు 7, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సైదాపురం గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలోని కొండల నడుమ వెలసియున్న శ్రీ నవకోటి సిద్ధేశ్వర, శ్రీ నవనాథ సిద్ధేశ్వరులు స్వయంభువులై వెలిసయున్న సిద్ధలయ్య కోనలో కార్తీక మహోత్సవాలు రెండో కార్తీక సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సైదాపురం, చింతారెడ్డిపాళెం గ్రామాలకు చెందిన అక్కనవారి బ్రదర్స్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మహోత్సవాల్లో దేవస్థాన కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వార్త
రిపోర్టర్స్ కావలెను
తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
నెల్లూరు నగరంలో... అర్బన్, సంతపేట, దర్గామిట్ట, బారకాసు, సీతారామపురం, కొండాపురం, వరికుంటపాడు మండలాలకు విలేకర్లు కావలెను.
మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
వార్త కార్యాలయం, ఎ.కె.నగర్, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, నెల్లూరు.
ఫోన్: 7675867756, 9347112031